# స్త్రీకి చదువెందుకు?

సాయంకాల మయింది మిల్లులన్నీ పనివాళ్లను ఇళ్లకు పొమ్మని సైరన్లు కొట్టేశాయి మేకలు 'మే మే' మంటూ మందలు మందలుగా గొల్లవీధికి చేరుకుంటున్నాయి. పొలాల్లో ఉద్యోగాలకు వెళ్లిన స్త్రీలు జట్లు జట్లుగా ఇళ్లకు వస్తున్నారు పార్కులో రేడియోలోంచి సంగీతం వినిపిస్తోంది.

వీనుల విందుగా వినిపిస్తున్న ఆ సంగీతానికి లయ వేస్తూ ఒకమూల అరుగుపై కూర్చున్నాడు గంగారాం.

ఎంత కమ్మగా ఉందా కీర్తన. ఆ పాడుతున్న ఆమె కంఠం కూడ కీర్తనకు తగినట్లుగానే ఉంది ఇంత కమ్మగా పాడుతున్న ఆ అమ్మాయి ఎంత అందంగా ఉంటుందో? అనుకుంటూ ఆనందిస్తున్న గంగారాం, ఎదురుగా వస్తున్న రామారావుని గమనించలేకపోయాడు

రామారావు దగ్గరికి వచ్చి అతని కెదురుగా నవ్వుతూ నిల్చున్నాడు గంగారాం నవ్వుతున్న రామారావుని చూసి తన ఆలోచనా ప్రపంచం నుండి తేరుకున్నాడు

"అరె! రామారావుగారా? రండి, కూర్చోండి; మీరు రావటం నేను చూడనే లేదు" అన్నాడు ప్రక్కనున్న స్థలం చూపిస్తూ

రామారావు నవ్వుతూ "ఏదో ఆలోచిస్తున్నట్లున్నారు?" అన్నాడు ప్రక్కన కూర్చుంటూ

"అబ్బే! ఆలోచించట మేమీ లేదండి సంగీతం వింటున్నాను ఇంతకీ మీరు మీ ఊరినుండి ఎప్పుడు వచ్చారు?" ప్రశ్నించాడు గంగారాం.

"మధ్యాహ్నం వచ్చానండి ఇప్పుడే నిద్రనుంచి లేచి షికారుకని బయలుదేరి మీ రూముకి వెళ్లాను. తాళం వేసి ఉంది. ఇక్కడ ఉంటారనుకుని వచ్చాను" అంటూ సిగరెట్టు తీసి అందించాడు రామారావు. ఇద్దరూ సిగరెట్లు ముట్టించారు.

"ఆ, అయితే ఏమిటి విశేషాలు; మీరు వెళ్లిన పనేమైంది కాయా పండా?"

"సందిగ్ధంలో పడింది" అన్నాడు రామారావు సిగరెట్టు పొగ వదులుతూ.

"అంటే?"

"ఇద్దరి పిల్లలను చూపించారు. నాకే పిల్ల నచ్చితే ఆపిల్లను చేసుకోమన్నారు. ఒక పిల్ల తండ్రికి ఆస్తి ఉంది. కాని పిల్లకు చదువు పూర్తిగా రాదు. పిల్ల అందంగా ఉంది రెండో పిల్ల తండ్రికి ఆస్తి లేదు కాని పిల్లను వాళ్లన్న ఫోరం వరకు చదివించాడు ఎక్కువ అందకత్తె కాదు, అట్లా అని కురూపి కూడ కాదు. ఒక మాదిరిగా బాగానే ఉంది."

'అయితే ఏ పిల్లను పెళ్ళి చేసుకో దలిచారు?"

"ఏ పిల్లను చేసుకునేది నేను ఆలోచించి ఉత్తరం వ్రాస్తానని చెప్పి వచ్చేశాను ఇప్పుడు ఈ విషయంలో మీ అభిప్రాయం చెప్పాలి."

గంగారాం కొంతసేపాలోచించి,

"మీరా రెండవ పిల్లనే చేసుకోవటం మంచిదని నా అభిప్రాయం" అన్నాడు.

"మా ఇంటిదగ్గరకూడ ఇలాగే అన్నారు కాని ఆ మొదటి పిల్ల నెందుకు చేసుకోకూడదు?"

"ఇదుగో ఇటు చూడండి రామారావుగారూ! మీరు చదువుకున్నారు దానికి తోడు ఉద్యోగం చేస్తున్నారు అటువంటప్పుడు మీరు చదువుకున్న అమ్మాయిని చేసుకుంటే మీ సంసారం సుఖంగా వెళ్ళిపోతుంది."

ఈ మాటకి రామారావు నవ్వేడు.

"నవ్వుతున్నారేం?"

"మీ అభిప్రాయం వింటుంటే నవ్వొచ్చింది. చదువుకున్న పిల్లల సంసారాలే చక్కగా ఉంటాయని, చదువులేని పిల్లలు కాపురాలు చెయ్యలేరని మీ ఉద్దేశం కాబోలు? వంట ఇంట్లో కూర్చునే స్త్రీకి చదువెందుకండీ; వాళ్ళేం ఉద్యోగాలు చెయ్యాలా, ఊళ్ళేలాలా?" హేళనగా అడిగాడు రామారావు.

తన సలహాను అంత హేళనగా చూసినందుకు గంగారాంకి కొద్దిగా కోపం వచ్చింది.

"కాపురాలు చెయ్యలేరని నేననలేదు

కొండపల్లి సాంబమూర్తి

స్త్రీకి చదువుండటం మంచిది. అందువలన పురుషుని మన స్తత్వం అర్థంచేసుకొని సంసారంలో ఎటువంటి కలతలు రాకుండా సుఖప్రదం చేసుకోగలరని నా అభిప్రాయం. పిల్లల పెంపకంలో కూడ వారిద్దరికీ పూర్తి స్వతంత్ర్యత ఉంటుంది. చదువుకోవటం ఒక్క ఉద్యోగం గురించే కాదు రామారావుగారూ! లోక జ్ఞానం కొరకు ప్రతి వ్యక్తి ఆడ మగ అనే భేదం లేకుండా చదువుకోవాలి. పిల్లలకు చదువు నేర్పుతున్న మీకు, చదువుకు ఉన్న ప్రాముఖ్యాన్ని చెప్పవలసింది, కాని మీరే చదువెందుకండీ అంటే ఇంక ఇతరుల మాటేమిటి?"

గంగారాంకి కోపం వచ్చిందని తెలుసుకొని రామారావు నొచ్చుకున్నాడు. "క్షమించండి గంగారాంగారూ! ఈ మాత్రం దానికే మీకు కోపం వస్తుందని నేననుకోలేదు" అన్నాడు రామారావు.

"నా కెందుకండీ కోపం; అందులో మీ పెళ్ళి విషయంలో సలహా లివ్వటానికి నేనెవర్ని?" అన్నాడు

రామారావు మౌనం వహించాడు

క్రమక్రమంగా చీకటి పడుతోంది. పార్కులో జనం కూడ తగ్గిపోసాగేరు. ఇద్దరూ లేచి ఎవరి గదికి వాళ్లు వెళ్ళిపోయారు.


ఈ సంభాషణ జరిగి రెండు సంవత్సరాలైంది. అప్పటినుండి గంగారాం, రామారావుకి సలహా లివ్వటం మానేశాడు రామారావు చదువులేని, ఆస్తిఅందంగల 'లక్ష్మి'ని పెళ్లి చేసుకున్నాడు. లక్ష్మి కాపురానికి వచ్చి వారం రోజులయింది పుట్టింటినుండి తెచ్చుకున్న సామాను సర్దుకోవటంతోనే ఈ వారం రోజులు గడిపిందామె

## 2

ఉదయం వేగం కాఫీ తయారుచేసి ఇచ్చి రామారావుని స్కూలుకి పంపించి, తను వంట ప్రయత్నం చేస్తోంది లక్ష్మి చాకలి బట్టలకోరకు వచ్చింది

"ఏమే, ఈ వేళప్పుడొస్తే నీకు బట్టలెలా వెయ్యడం?" అంది లక్ష్మి

"ఇప్పుడు బట్టలు వెయ్యటానికేం ఆటంక ముందమ్మగారూ?"



ఇటీవల మద్రాసులో జరిగిన రష్యన్ సర్కస్ ప్రదర్శనంలో ఒకదృశ్యం. ఈ సర్కస్ వారు మద్రాసులో 1 35,000 రూ ల పైగా వసూలుచేసి భారతప్రధాని జాతీయ సహాయ నిధికి సమర్పించారు

# ★ స్త్రీకి చదువెందుకు ★

"పద్దు ఎవరు వ్రాస్తారు?" తీవ్రంగా ప్రశ్నించింది లక్ష్మి.

అప్పటికిగాని లక్ష్మికి చదువురాదని చాకలిదానికి తెలియలేదు "పోనీలెండమ్మ గారూ! రేపు రేవుకి వెళ్తున్నాను అందు వలన ఎల్లుండి వస్తాను" అంది చాకలి

"ఎల్లుండి వస్తే బట లెప్పుడు తెస్తావు? అసలే ఆయనకు బట్టలులేవు తొడుక్కున్న జతమాసిపోతే స్కూలుకి శలవు పెట్టాలేమో అంటున్నారాయన పద్దు వ్రాయటానికి ఈ చుట్టుప్రక్కల చదువుకున్న వాళ్ళెవరూ లేరాయె. వెళ్లి...పద్దు వేయటానికి ఆయన్నే పిలు స్కూల్లో వుంటారు" అని చెప్పింది లక్ష్మి.

చాకలి మెల్లగా కదలి స్కూలువైపు బయలుదేరివెళ్లింది. స్కూలంతా నిశ్శబ్దంగా ఉంది పిల్లలందరూ ఉపాధ్యాయులు చెప్పుతున్న పాఠాన్ని శ్రద్ధగా వింటు న్నారు. ఉపాధ్యాయుల కంఠాలన్నీ ఒక దాని వెంబడి ఒకటి విన్పిస్తున్నాయి.

రామారావు బోర్డుమీద లెక్క వేసి చెప్తున్నాడు గంగారాం ప్రక్కనున్న గదిలో ఉన్నాడు పిలలకు ఒకలెక్క ఇచ్చి, దానిని చేయమని చెప్పి గదిలో పచార్లు చేస్తున్నాడు గంగారాం.

లెక్క చేస్తున్న రామారావునిచూసి "బాబుగారూ!" అని పిలిచింది చాకలి,

రామారావు 'ఏం?' అన్నట్లు తలెత్తి చాకలివైపు చూచాడు.

"పద్దు వేయటానికి అమ్మగారు రమ్మం టున్నారు" అంది చాకలి

పిల్లలంతా గొల్లుమని నవ్వేశారు

"పోవే పోపో," అని కోపంగా అర చాడు రామారావు.

రామారావు కోపానికి కారణం తెలియక చాకలి బిక్కమొగం వేసుకొని వెళ్లిపో యింది.

గంగారాం తన గదినుండి బైటకువచ్చి రామారావుని చూచి చిన్న చిరునవ్వు నవ్వేడు.

"స్త్రీకి చదువెందుకుండాలో తెలిసిందా?" అన్నట్లు ప్రతిధ్వనించిందా నవ్వు.

మెల్లగా వచ్చి కుర్చీలో కూలబడ్డాడు రామారావు. పిల్లలు రొదచేస్తున్నారు. అయినా వారిని అదలించేశక్తి ఆసమయంలో అతనికి లేదు.

ఎంత అవమానం? నలభైమంది విద్యార్థుల దగర, అందులో తోటి ఉపాధ్యాయునివద్ద అవమానం అతనికి సహింపరానిదయింది. తనని చూసి గంగారాం నవ్వుతున్నాడు. తననిచూసి విద్యార్థులంతా నవ్వుతున్నారు. ఇంకేమేమో ఆలోచిస్తూ తలపట్టుకొని కుర్చీలో కూర్చుండిపోయాడు రామారావు.

"పాపం, మాస్టరుగారి భార్యకు చదువు రాదు కాబోలు" అంది ప్రక్క బెంచీలో కూర్చున్న ఒకమ్మాయి

"మనకి చదువు నేర్పుతున్నారుగాని, ఆయన భార్యకు చదువు నేర్పలేరు కాబోలు" అని చిన్న నవ్వునవ్వింది ఇంకొకమ్మాయి

"ఉష్. ఊరుకోండమ్మా ఆయనకు విన పడితే బాగుండదు" అని మందలించింది మరో అమ్మాయి.

ఈ మాటలన్నీ రామారావు చెవుల్ని దూసుకుంటూ గాలిలో కలసిపోయాయి. కొంతసేపటికి బెల్ కొట్టేరు. రామారావు మెల్లగా బైటకు నడచాడు.

ద్వారం దాటుతూండగా "చాకలి పద్దు మాష్టరు వెళ్ళిపోతున్నార్రోయ్" అని వెనక బెంచీలోనుండి ఓ విద్యార్థి కేక వేశాడు.

అసలే మతిస్థిరంలేక బాధపడుతున్న రామారావుకి ఈ బిరుదు వినడంతో తల గిర్రున తిరిగింది. భూమి క్రుంగిపోతున్న ట్లుగా అనిపించింది మెల్లగా రీడింగ్ రూమ్ లోనికి వెళ్ళిపోయాడు.

స్కూలు విడిచిపెట్టగానే ఇంటికి వెళ్ళి లక్ష్మిమీద విరుచుకుపడ్డాడు. "నీకేం బుద్ధి లేదా?" అని.

కారణం లేకుండా భర్త ఇలా అనడం చూచి లక్ష్మి నిర్ఘాంతపోయింది. "నేనేం చేశాను?" అంది కొంచెం తమాయించుకొని.

"ఏం చేశావని అడుగుతున్నావా? . . ఆ చాకలి దాన్ని స్కూలుకెందుకు పంపించావ్?" అన్నాడు కొంచెం స్వరం హెచ్చించి.

"లేకపోతే పద్దు ఎవరు వ్రాస్తారేమిటి" అనడిగింది లక్ష్మి

"ఎవరూ వ్రాయటానికి లేకపోతే రేపు రమ్మని చెప్పకోవాలి" అతని కంఠంలో ఇంకా కోపం ప్రతిధ్వనిస్తోంది.

"ఆ.. ఇప్పుడు రేపు కాదు ఎల్లుండి వస్తుంది" అంది లక్ష్మి వెటకారంగా.

"ఏం?" అనడిగాడు కొంచెం స్వరం తగ్గించి.

"రేపు రేవుకి వెళ్తుందట, ఎల్లుండి వస్తానని చెప్పివెళ్ళిపోయింది"

"మరి నా బట్టల మాట?" అన్నాడు అయోమయంగా.

"అదేమో నాకేం తెలుసు? మీరు బట్టలు గురించి తొందరపడుతున్నారని స్కూలుకి పంపాను. దాన్ని తిట్టి పొమ్మన్నారట మీ బట్టల విషయంలో మీకు లేని తొందర నాకెందుకు?" "నా ఖర్మకొద్దీ దొరికావ్" అనుకుని కాళ్ళీడ్చుకుంటూ చాకలి ఇంటికి వెళ్ళాడు ఆమెని బ్రతిమిలాడి తీసుకువచ్చి బట్టలు వేసుకున్నాడు. లేక పోతే బట్టలు లేని కారణంగా అనవసరంగా స్కూలుకు శెలవు పెట్టవలసి వచ్చేది.

తిరిగి చాకలి బట్టలు ఉతికి తెచ్చేటప్పుడు తనకు కబురు పంపకుండా ఉండటానికి రామారావు ముందే జాగ్రత్త తీసుకున్నాడు. "చాకలి ఇచ్చిన బట్టల్ని లెక్కపెట్టుకుని తీసుకో, నేను వచ్చిన తర్వాత పద్దు చూస్తాను" అని భార్యకు చెప్పి చాకలిని పంపివేశాడు.

చాకలి వెళ్ళిపోయిన తర్వాత,

"ఇవన్నీ ఏమిటండీ, ఇవెందుకు పనికి వస్తాయి?" అనడిగింది లక్ష్మి, గదిలో గుట్టలు గుట్టలుగా పడి ఉన్న కాగితాల కట్టలను చూస్తూ.

రామారావు చిన్న నవ్వు నవ్వి,

"నా ఉద్యోగం ఏమిటో తెలుసా?" అని అడిగాడు.

"అయ్యవారి ఉద్యోగం"

"అవి విద్యార్థుల అన్సరు పేపర్లు"

"ఇవన్నీ అమ్మి వేయకూడదూ?"

"అవి అమ్మితే విద్యార్థులు బ్రతకనిస్తారనుకున్నావా? మాస్టారికి కాఫీకి డబ్బులేక పోతే మన అన్సరు పేపర్లు అమ్మేశాడని దండోరా వేస్తారు"

"ఇవెందుకూ పనికిరావన్న మాట?"

"..పుస్తకాలు తప్పించి మిగతా కాగితాల్లో ఒక్క కాగితం కూడ పనికిరాదు" అంటూ భోజనానికి లేచాడు రామారావు.

"అయితే, కట్టెలు లేనప్పుడు వీటిని పొయ్యిలో పెట్టమన్నారా?"

"నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో, ఆకలేస్తుంది వేగం వడ్డించు" అంటూ వంటగది వైపు నడిచాడు రామారావు. లక్ష్మి అతన్ననుసరించింది.

## 3

రెండు రోజుల తర్వాత చాకలి బట్టలు తీసుకొని వచ్చింది. లక్ష్మి వాటి నన్నిటిని లెక్కపెట్టుకొని తీసుకుంది. తన బట్టలు తనకు తెలుసు. అందువలన తన బట్టలన్నీ ఉన్నాయో లేదో నని చూసుకుంది. అన్నీ సరిపోయాయి. రామారావు బట్టలు వేరే ఉంచింది.

రామారావు బట్టలు పెట్టుకోటానికి పెట్టె నొకదానిని కేటాయించింది. తన బట్టలు పెట్టుకోటానికి బీరువా తెరచింది. ఆ బీరువా రామారావుది. దానిలో టాయిలెట్ సామానులు, కాగితాలు, పుస్తకాలు మొదలైన వన్నీ పెట్టుకున్నాడు రామారావు. వాటినన్నిటినీ తీసి కిటికీపై ఉంచింది. బీరువా అడుగున కొన్ని కాగితాలున్నాయి.

"హూ... బీరువాలో కూడా చెత్త కాగితాలే" అనుకుంటూ వాటిని తీసి క్రింద పారవేసి, బీరువా శుభ్రంగా తుడిచింది. లక్ష్మి తన బట్టలను బీరువాలో సర్దుకుంటుండగా ఇల్లు ఊడ్చటానికి పనిమనిషి వచ్చి గది ఊడ్చటం మొదలు పెట్టింది. క్రిందపడి ఉన్న కాగితాలను చూస్తూ,

"ఇవెందుకూ పనికిరావా అమ్మగారూ?" అని ప్రశ్నించింది పనిమనిషి.

"ఎందుకూ పనికిరావు పారవేయ్" అంది లక్ష్మి.

"పారేయటమెందుకమ్మగారూ, పొయ్యి రాజెయ్యటానికిపనికివస్తా"యంటూ వాటిని తీసుకొని వెళ్ళి పొయ్యి ప్రక్కన పెట్టింది.

* * *

స్కూలు విడిచిపెట్టగానే ఇంటికి రాకుండా పార్కులోనికి వెళ్ళి కూర్చున్నాడు రామారావు. అతని మనస్సేమీ



రష్యన్ సర్కస్‌లో మరొక అద్భుత దృశ్యం.

# ★ స్త్రీకి చదువెందుకు? ★

బాగుండటం లేదు. అవశపరంగా వచ్చిన ఆ "చాకలిపద్దు మాస్టారు" అనే బిరుదు తలపు వకు వచ్చినప్పుడల్లా అతనిగుండెలు వేగంగా కొట్టుకుం టున్నాయి. తల కొట్టివేసినట్లుగా బాధపడుతున్నాడు దానిని విద్యార్థులనోటి నుండి రాకుండా చెయ్యటమెట్లా? అని ఆలోచిస్తూ కూర్చున్నాడు.

దీనికి మూలకారణం లక్ష్మి. లక్ష్మికి చదువు లేకపోవడం వల్లనే ఇదంతా వచ్చింది. ఉదయం తను, గంగారాం రీడింగ్ రూంలో ఉండగా ఒక కుర్రవాడు చీటీ తెచ్చి గంగారాంకు ఇచ్చాడు. అది ఆతని భార్యవద్దనుంచే వని తనకు తెలుసు. తన కటువంటి భాగ్యం కలగనందుల కెంతో విచారించాడు. లక్ష్మికి చదువు లేకపోయినా తనను సంతోషపెట్టటాని కెన్నో పనులు చేస్తూంది. అమాయకమైన ఆమె ముఖం చూస్తే తనకు ఎంత కోపం వచ్చినా ఇట్టే దిగజారిపోతుంది. ఏది ఏమయినా, తను మొదట లక్ష్మికి చదువు రాదని తెలిసుంటే పెళ్లి చేసుకున్నాడు. అందువలన ఎటువంటి తప్పు లొచ్చినా ఆమెను నిందించడం భావ్యం కాదను కున్నాడు.

కొద్దిగా చీకటి పడగానే ఇంటిముఖం పట్టేడు. రామారావు ఇంటికి వచ్చేసరికి గది శుభ్రంగా వుంది. సామానులన్నీ శుభ్రంగా తుడిచి పెట్టబడి వున్నాయి. లక్ష్మి శుభ్రతను మెచ్చుకుంటూ దుస్తులు మార్చుకుని కూనిరాగం తీస్తూ కుర్చీలో కూర్చున్నాడు. ఎదురుగా లక్ష్మి బట్టలతో నిండుగా కనపడ్డ బీరువాను చూసి ఆశ్చర్యపోయాడు.

"లక్ష్మి...లక్ష్మి." అని కేక వేశాడు. పిలుపు విని లక్ష్మి వంటగదిలో నుండి వచ్చింది.

"బీరువాలోని సామానులన్నీ ఎక్కడ పెట్టేవ్?" ఆతృతగా అడిగాడు రామారావు.

"ఇదిగో ఈ కిటికీమీద ఉంచాను" అని చూపించింది లక్ష్మి. రామారావు కుర్చీలో నుండి లేచి కిటికీ వద్దకు వెళ్ళి పుస్తకాలన్నీ ఓసారి గాలించాడు.

"ఏదీ, తాళాలోసారి ఇవ్వు" అనడిగాడు

లక్ష్మి ఇచ్చిన తాళాలు అందుకుని బీరువా తెరచి బట్టలు తొలగించి అడుగున వేటికోసమో వెతకటం మొదలు పెట్టేడు. తను కష్టపడి సర్దుకున్న బట్టల నతడలా చిందర వందర చేస్తుంటే లక్ష్మికి చిరాకెత్తింది

"ఏమిటలా వెతుకుతున్నారు? దానిలో మరింకేమీ లేవు" అన్నది చిరాకుగా

"ఇక్కడ కొన్ని కాగితాలు పెట్టేను, అవి లేవే?"

"కాగితాలా...ఓ, అవా! పారేశాను."

"ఎక్కడ?" గాభరాగా అడిగాడు రామారావు అతని గాభరా చూసి లక్ష్మి కొద్దిగా జడిసింది.

"ఎక్కడ పారవేశావ్?" గద్దించి అడిగాడు రామారావు.

రామారావు కోపం చూసి లక్ష్మి బిత్తర పోయింది.

"మాటాడవేం?" గర్జించాడు.

లక్ష్మికి పెదిమలు తడబడ్డాయి "కా...ల్చే.. శా.. ను" అంది తడబడుతూ.

రామారావు దెబ్బ తిన్న వాడిలా తల పట్టుకొని కూలబడి పోయాడు.

"అవి పనికివచ్చే కాగితాలా?" మెల్లగా జంకుతూ ప్రశ్నించింది లక్ష్మి

"అవి డిగ్రీ సర్టిఫికేట్లే.." అంటూపిచ్చి వానిలా జుట్టు పీక్కున్నాడు రామారావు.

★




ఆంధ్ర ఏజెంట్లు మెసర్సు పి ఆర్ ట్రేడ్ ఏజెన్సీస్, విజయవాడ